క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి పరిపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాల వితరణ చేసి, ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

దంత సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): దంత సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని దంత వైద్యులు సీహెచ్ ప్రణీత్, అమలేష్ చెప్పారు. స్థానిక షిలో హా ప్రేయర్ హాల్‌లో ఐకాన్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యులు దంత సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. నోటి దుర్వాసన, చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి సమస్యలను గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి రోజూ రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలు జంక్ ఫుడ్స్ తినకుండా తల్లిదండ్రులు చూసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఎక్కువగా తినాలని చెప్పారు. 45 మంది రోగుల దంతాలను పరిశీలించి మందులను ఉచితంగా అందజేశారు.

8న మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంటినీ హాస్పిటల్స్ సహకారంతో రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో థైరాయిడ్, ఎముకలు, కీళ్ల వ్యాధులు, మధుమేహం వంటి నిర్ధారణ పరీక్షలను వైద్యులు నిర్వహిస్తారన్నారు. మహిళల ఆరోగ్యం – కుటుంబానికి ఆధారం అనే నినాదంతో అవగాహన సదస్సు చేపట్టామని చెప్పారు. అశోక్‌నగర్‌లోని సోమనాథ్ హాస్పిటల్‌లో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్య పరీక్షలకు 98498 72499 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం మల్లెలు పూసే వెన్నెలకాసే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. హైదరాబాద్, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. సీనియర్ గాయకుడు వైఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.లలిత, వీణ, గంటిశైలజ, మల్లేశ్వరి, స్వరకల్యాణి, రాధాకారాణి, భారతి, శివరామకృష్ణ, రవీంద్రనాథ్ ఆచార్య, కృష్ణమోహన్, అవినాష్‌లు చిత్రగీతాలను ఆలపించారు. వ్యాఖ్యాతగా గాయకుడు ప్రభాకర్ వ్యవహరించారు.

అన్నసంతర్పణ సమితి శాశ్వత వంటశాలకు శంకుస్థాపన

పాయకాపురం(విజయవాడరూరల్): గత నాలుగు సంవత్సరాలుగా ఎంతోమంది ఆకలి తీర్చిన అన్నసంతర్పణ సమితి శాశ్వత వంటశాల, సమావేశ మందిర నిర్మాణానికి నున్న రోడ్డు డీ మార్ట్ సమీపంలో ఆదివారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుపేద, పేదల కడుపు నింపుతున్న అన్న సంతర్పణ సమితి మరింత మందికి ఉచిత భోజనం అందించుటకు శాశ్వత వంటశాల, వృత్తి విద్యలు నేర్పించుటకు సమావేశ మందిరం ఉపయోగపడతాయన్నారు. అన్న సంతర్పణ సమితికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ మాట్లాడుతూ సమితి సభ్యులు, దాతల సహకారంతో సమితి సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. తమకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో వ్యర్థాలతో అవస్థలు

- పాతబస్తీ అవుట్‌ఫాల్ డ్రెన్‌లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు
- వ్యర్థాల కారణంగా పెరుగుతున్న దోమలు
- డ్రెన్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలంటున్న ప్రజలు



పాతబస్తీలోని ప్రధాన అవుట్‌ఫాల్ డ్రెన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర చెత్తాచెదారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని ప్రధాన డ్రెన్లలో వస్తున్న వ్యర్థాలతో ప్రజలు అల్లాడుతున్నారు. నియోజకవర్గంలోని పాతబస్తీలోని పలు డివిజన్లకు సంబంధించి అవుట్ ఫాల్ డ్రెన్లలో రోజురోజుకు వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఆ వ్యర్థాల కారణంగా అటు ప్రజలకు ఇటు పారిశుద్ధ్య సిబ్బందికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాతబస్తీలోని కొంతమంది నివాసితుల్లో చైతన్యం లేకపోవటంతో పాటుగా నిర్లక్ష్యం కారణంగా డ్రెన్లలో భారీగా చెత్త వేయటంతో మురుగునీరు కొన్ని చోట్ల నిలిచిపోతోంది. తత్ఫలితంగా దోమలు పెరుగుతున్నాయి. వాటి కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

భారీగా వస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

పాతబస్తీలోని మల్లికార్జునపేట నుంచి ప్రారంభమయ్యే అవుట్ ఫాల్ డ్రెన్ బ్రాహ్మణవీధి, పూలబావివీధి, సుబ్బరామయ్యవీధి, జెండాచెట్టు తదితర ప్రాంతాల మీదుగా గాంధీ హిల్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి రైల్వే లైన్ల కింద నుంచి రైవస్ కెనాల్‌లోకి చేరుతుంది. ఈ ప్రధాన డ్రెన్‌లోకి పాతబస్తీలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే డ్రెన్ల మురుగునీరు కలిసి బయటకు వెళ్తుంది. అయితే దీనిలోకి భారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు తరలివస్తున్నాయి. దాంతో మురుగునీరు పారుదల నిలిచిపోయి దోమలు భారీగా పెరిగిపోతున్నాయి. దీనిపై స్థానిక ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

చెత్త రాకుండా నివారించాలి

డ్రెన్లలో చెత్త రాకుండా నివారించాలని స్థానికులు నగరపాలకసంస్థ అధికారులను కోరుతున్నారు. ప్రధానంగా డ్రెన్లలో చెత్త కారణంగా వన్‌టౌన్‌లోని పలు వీధుల్లో చిన్నపాటి వర్షం పడినా కూడా మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. సాధారణ రోజుల్లోనూ చెత్త కారణంగా డ్రెన్లలో నీటి పారుదల నిలిచిపోతోంది. తత్ఫలితంగా దోమల ఉధృతి పెరగుతోంది. దీనిపై దృష్టి పెట్టాలంటూ స్థానికులు నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బందిని కోరుతున్నారు.

జల్లెడలను ఏర్పాటు చేయాలి

ప్రతి ప్రధాన వీధిలోనూ డ్రెన్లకు జల్లెడలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా చెత్తాచెదారం ముందుకు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకునే విధంగా జల్లెడలను ఏర్పాటు చేస్తే అవుట్‌ఫాల్ డ్రెన్ వరకూ చెత్త చేరదని పలువురు చెబుతున్నారు. జల్లెడలు ఏర్పాటు చేసిన చోటు నుంచి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి మురుగునీరు సాఫీగా ముందుకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): అతి వేగంతో వచ్చిన ఆటో ఢీకొనటంతో యువకుడు గాయాలపాలైన ఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం గాంధీ బొమ్మ రోడ్‌లో నివసిస్తున్న ఆర్ముగం గణేష్ స్థానిక బ్యాంక్ సెంటర్‌లో టీ స్టాల్ నడుపుతున్నాడు. గత నెల 28వ తేదీ ఉదయం టీ స్టాల్ వద్దకు వెళ్లాడు. సుమారు 8 గంటల సమయంలో తండ్రి ఆర్ముగం పెరుమాళ్ రెడ్డి షాపు వద్దకు రాగా ఇంటికెళ్లి టిఫిన్ చేసి వస్తానని చెప్పి బయలుదేరి జాతీయ రహదారి దాటుతుండగా స్వాతి థియేటర్ సెంటర్ వైపు నుంచి కుమ్మరిపాలెం సెంటర్ వైపు వెళుతున్న ఆటో గణేష్‌ను ఢీకొట్టింది. అతను వెంటనే కిందపడిపోయాడు. సమీపంలోనే ఉన్న తండ్రి వచ్చి కుమారుడిని స్థానిక ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకువెళ్లాడు. ఎడమ కాలు కింద భాగాన ఎముక విరిగింది. కుడి కాలు తుంటి వద్ద ఎముక విరగ్గా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలిసిన భవానీపురం పోలీసులు ఆదివారం హాస్పిటల్‌కు వచ్చి బాధితుడి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకుని కేసు నమోదు చేశారు.

సీసీ కెమెరాలపై అవగాహన పెంపొందించుకోవాలి

పశ్చిమ ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేర పరిశోధనల్లో సీసీ కెమెరాల పుటేజీ ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ వాటిపట్ల అవగాహన పెంపొందించుకోవాలని పశ్చిమ నియోజకవర్గం ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపూడిలో గల దత్త కల్యాణ మండపంలో సీసీ కెమెరాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలోను, సంస్థల్లోను సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని గృహ సముదాయాల్లో సెక్యూరిటీతో పాటు సీసీ కెమెరాలు పెట్టుకుంటే వారికి రక్షణగా ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీ కారణంగా ఇటీవల జరిగిన నేరాల్లో నిందితులను గుర్తించి పట్టుకున్నామని చెప్పారు. అవగాహన సదస్సులో పాల్గొన్న గొల్లపూడి ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమ ఏసీపీ దుర్గారావు, భవానీపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, ఎస్‌ఐలు, గొల్లపూడి టీడీపీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, నర్రా వాసు, నారద పాల్గొన్నారు.

పిల్లలను చురుకైన పౌరులుగా మార్చే బాలల పార్లమెంట్



బాలల పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బాలలను చురుకైన పౌరులుగా, నాయకులుగా మార్చటానికి బాలల పార్లమెంట్ దోహదం పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పటమటలోని ఎస్‌ఎస్‌ఎం స్కూలులో ఆదివారం గృహ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో బాలల పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ అంజనా టిర్కీ మాట్లాడుతూ.. తాము 211 గ్రూపులతో 42 మురికివాడల్లో పని చేస్తున్నామన్నారు. విజయవాడ నగర బాలల పార్లమెంట్‌లో 10 కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. బాలల పార్లమెంట్ అనే కార్యక్రమం ద్వారా సమ్మిళితమైన, సమానమైన సమాజాన్ని సృష్టించడానికి వివిధ మార్గాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.శ్వేత మాట్లాడుతూ.. నగర బాలల పార్లమెంట్ సామాజిక బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎలా ప్రేరేపించిందో, వారికి ఎలా సహాయపడిందో వివరించారు. కార్యక్రమంలో పి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మనోధైర్యాన్ని అందించాలి



ఐసీజీసీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, విశాల్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ తరం విద్యార్థులు అపజయాన్ని అంగీకరించకుండా మానసిక స్థైర్యాన్ని కోల్పోతున్నారని, వారిలో మనోధైర్యాన్ని నింపే చర్యలు అత్యవసరమని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. అందుకోసం దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లను నియమించామన్నారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో ఆదివారం ఇండ్లాస్ చైల్డ్ గైడెన్స్ క్లినిక్ 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలతో కూడిన పాఠ్య ప్రణాళిక అవసరమన్నారు. అనంతరం డాక్టర్ ఇండ్ల విశాల్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లలకు సైకియాట్రిక్ ఎవల్యేషన్ ఫిజియోథెరపీ కౌన్సెలింగ్, స్పీచ్ థెరపీ, హోట్ బేస్డ్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్, బిహేవియర్ థెరపీ వంటి సౌకర్యాలు ఐసీజీసీ అందిస్తోందని చెప్పారు. విజయవాడలో తొలిసారిగా దివ్యాంగ పిల్లల కోసం ఏర్పాటు చేసిన హాస్పిటల్ ఐసీజీసీ అన్నారు. ఈ సందర్భంగా ఐసీజీసీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇండ్లాస్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ బి.హనుమయ్య, కార్యదర్శి వి.సురేష్‌కుమార్, డాక్టర్ మంజిరీదేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక పక్షపాతి వుప్పల లక్ష్మణరావు



లక్ష్మణరావు సాహిత్య పరిచయ సభలో మాట్లాడుతున్న రచయిత్రి ఓల్గా

విజయవాడకల్చరల్: శ్రామిక పక్షపాతి డాక్టర్ వుప్పల లక్ష్మణరావు అని రచయిత్రి, అనువాదకురాలు ఓల్గా అన్నారు. సాహితీమిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో నవలా రచయిత, అనువాదకుడు, సంపాదకుడు లక్ష్మణరావు సాహిత్య రచనల గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఓల్గా వుప్పల సాహితీ ప్రస్థానంలోని అనేక విషయాలను వివరించారు. ఆయన రచించిన అతడు ఆమె నవల ద్వారా సాహితీ ప్రపంచంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. అతని రచనల్లో సామాజిక బతుకు కనిపిస్తోందని చెప్పారు. మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయం ద్వారా అనేక రచనలను తెలుగులోకి అనువాదించారని తెలిపారు. అతడు ఆమె నవల చదివిన తరువాత ఆమె – మనం పేరుతో పెద్ద వ్యాసం రచించిన సందర్భం గుర్తు చేసుకున్నారు. శ్రీశ్రీ ప్రింటర్స్‌ను విశ్వేశ్వరరావు ప్రారంభించాక ప్రచురించిన రెండో పుస్తకమేనన్నారు. తనను ప్రభావితం చేసిన అంశాలు వారిలో కనిపించాయని గుర్తు చేసుకున్నారు. కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ.. నవలా రచయితగా, అనువాదకునిగా తెలుగు సాహిత్యానికి సేవలను అందించారని తెలిపారు. బరంపురానికి చెందిన వికాసం సంస్థ ప్రతినిధులు ఎంవీ కామేశ్వరరావు, బి.రవిశర్మ, సేతుపతి ఆదినారాయణ, చినుకు మాసపత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ వుప్పల జన్మించిన బరంపురంతో అనుబంధం సాహిత్య జీవిత విశేషాలను వివరించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ప్రముఖులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవానీపురంలోని విజయవాడ రవీంద్రభారతి స్కూల్ పీఆర్‌కే క్యాంపస్‌లో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు పలు అంశాలకు సంబంధించిన నమూనా ప్రాజెక్ట్‌లు ప్రదర్శించి వారిలోని సృజనాత్మకతను చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ఝాన్సీలక్ష్మీబాయ్, అతిథిగా పాల్గొన్న రవీంద్రభారతి హిందీ విభాగాధిపతి నాగమణి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నమూనా ప్రాజెక్టులను తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శాస్త్రం పట్ల ఆసక్తి పెంచుకుని బాల శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. సీవీ రామన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల జీవిత చరిత్రను తెలుసుకుని వారిని ఆదర్శంగా తీసుకుని నూతన ఆవిష్కరణలకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఆ దిశగా సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసిన రవీంద్ర భారతి విద్యా సంస్థల అధిపతి వీరమాచనేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎక్కడి మురుగునీరు అక్కడే!



పయ్యావుల దశరథ వీధిలో సైడు కాలువకు ఒక వైపు గట్టు కట్టని వైనం



ద్వారకానగర్ రోడ్‌లోని సైడు కాలువలో నిలిచిపోయిన మురుగునీరు

- అవగాహన లేని కాంట్రాక్టర్లు
- వీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం
- మురుగు నీరు ముందుకు వెళ్లనప్పుడు కాలువలు దేనికి?

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆ వీధుల్లో అన్నీ భవంతులే. రోడ్లు అద్భుతంగా ఉంటాయి. అయితే డ్రెయిన్ల పరిస్థితి మాత్రం అధ్వానం. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత పనులతో సైడు కాలువలోని మురుగు నీరు ఎక్కడిదక్కడే ఉంటుంది. దాంతో పగలు రాత్రి తేడా లేకుండా విజృంభిస్తున్న దోమల బాధతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు ముందుకు కదలనప్పుడు కాలువలు దేనికని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని 45వ డివిజన్ పరిధిలోగల కబేళా రోడ్‌కు అనుసంధానంగా ఉన్న పయ్యావుల దశరథ వీధి, ద్వారకానగర్, మాదాపు రామారావు వీధిలో సైడు కాలువలు అధికారుల అనాలోచిత పనులకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆయా వీధుల ప్రారంభంలో మెరక ఉండి, చివరకు వెళ్లేసరికి పల్లంగా ఉంటుంది. వీధుల్లో సగంలోపు వరకు ఉన్న నివాసాల్లోని వాడకం నీరు మాత్రమే సైడు కాలువ గుండా ప్రవహించి తూర్పు వైపున ఉన్న (కబేళా రోడ్) అవుట్ ఫాల్ డ్రెయిన్‌లోకి వెళుతుంది. ఆ పైన ఉండే నివాసాల ముందున్న సైడు కాలువ పల్లంగా ఉండటం వలన నివాసితుల వాడకం నీరు ఎక్కడిదక్కడే నిలిచిపోయి ఉంటుంది. ఎందుకంటే ముందంతా మెరకలో ఉండటంతో మురుగు నీరు ముందుకు వెళ్లే అవకాశం లేదు.

వర్షం కురిస్తే డ్రెయిన్‌లో మురుగునీరు వీధుల్లోకే వర్షం భారీగా కురిస్తే ఎగువ నుంచి కొట్టుకు వచ్చే చెత్తాచెదారంతో కబేళా రోడ్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిండిపోయి పొంగి పొర్లుతుంది. అప్పుడు ఆ మురుగునీరంతా మెయిన్ రోడ్‌కు అనుసంధానంగా ఉన్న వీధుల్లోని సైడు కాలువల్లోకి వచ్చేస్తుంది. వర్షం తగ్గిన తరువాత నిండిపోయిన డ్రెయిన్‌లోని మురుగునీరు నెమ్మదిగా వెనక్కి వస్తుంది. అప్పుడుగానీ వీధుల్లో గల సైడు కాలువల్లోని నీరు అతి నెమ్మదిగా తగ్గుతుంది. అది కూడా మెరకగా ఉన్న ప్రదేశంలో మాత్రమే. పల్లంలో ఉన్న కాలువలో నీరు అలానే ఉండి పోతుంది. సైడు కాలువల్లో నీరు ముందుకు వెళ్లేలా వాటం పెట్టాలని ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు స్థానిక పెద్దలు చెబితే ''మాకు తెలుసులే..మీరేం చెప్పనక్కర్లేదు'' అంటూ వారు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతా అయిపోయాక ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నది తామే కదా అని వాపోతున్నారు. ఆయా వీధుల్లో పల్లంలో ఉన్న సైడు కాలవల్లో సుమారు మూడు అడుగుల మేర మెరక చేస్తేనే మురుగునీరు సజావుగా ప్రవహిస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పల్లంగా ఉన్న సైడు కాలువ ఎత్తు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం

అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు నిర్మించాలనుకున్న వీధుల్లో సైడు కాలువలు నిర్మించిన తరువాతే రోడ్డు వేయాల్సి ఉంది. నగరపాలక సంస్థ అధికారులు టెండర్లు వేయడం, వాటిని దక్కించుకున్న కాంట్రాక్టర్లు కుదిరినప్పుడు ఇష్టారాజ్యంగా వేసేస్తున్నారు. ఆ తరువాత సైడు కాలువల గురించి ఆలోచిస్తున్నారు. వాటిని నిర్మించే ముందు మురుగునీరు ఎటు నుంచి ముందుకు ప్రవహించి అవుట్‌ఫాల్‌లో కలుస్తుందన్న ఆలోచన చేయరు. సైడు కాలువ కట్టేముందు దానికి రెండు వైపులా గట్టు కట్టాలన్న ఆలోచన అసలు ఉండదు. ఎందుకంటే వారికి ఉన్న అవగాహన అంతంత మాత్రమే. నిర్మాణాలు జరిగే సమయంలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనమే పయ్యావుల దశరథ వీధి, ద్వారకానగర్, మాదాసు రామారావు వీధులు. వీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అవగాహన లోపం ఫలితంగా స్థానికులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భర్త ఇంట్లో లేని సమయంలో కొంతమంది వ్యక్తులు వచ్చి ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసం చేశారని ఒక మహిళ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కట్టా సత్తెయ్య, శివ నాగమణి దంపతులు భవానీపురంలోని ఏకలవ్యనగర్‌లో నివసిస్తున్నారు. బాధితురాలి కథనం ప్రకారం శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో మేడా గోపి, కుంభా రాజేష్ అలియాస్ ఏసు, గరిక వీరేంద్ర, గరిక ప్రసాద్, బాలసాని అమ్ము, బాలసాని చంటి, గరిక రమణ, బాలసాని లక్ష్మి, మేడా దశరథ మరి కొంతమంది తమ ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఆఫీస్ రూంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి రాడ్డులతో ఇల్లంతా కలయ తిరుగుతూ 'కట్టా సత్తిగాడు ఏడి, మేము వాడిని చంపకుండా వెళ్లమని భయభ్రాంతులకు గురి చేశారు. ఆ సమయంలో శివ నాగమణి మరిదికి ఆరోగ్యం బాగోకపోవడంతో ఆమె భర్త కట్టా సత్తెయ్య హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. గొడవ గురించి ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేయగా ఆయన 112 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పారు. పోలీసులు వచ్చి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా పారిపోయారు. కుంభా రాజేష్ వలన తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, అతని నుంచి ప్రాణ రక్షణ కల్పించాలని శివ నాగమణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సండే ఫుల్ రష్



నగరంలోని నాన్ వెజ్ మార్కెట్‌లు ఆదివారం కావడంతో కిటకిటలాడాయి. విశాలాంధ్ర రోడ్డుతో పాటు బుడమేరు వంతెన వద్ద మటన్, చేపల విక్రయాలు జోరుగా జరిగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వినియోగదారులతో కిటకిటలాడుతున్న విశాలాంధ్ర రోడ్డు



బుడమేరు వంతెన వద్ద విక్రయానికి ఉంచిన చేపలు